
కమలాసన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ ప్రతినిధులు

మెడికల్ మాఫియాను అరికట్టాలి

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ మాఫియాను అరికట్టాలని, నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డికి ప్రోగ్రసివ్ యూత్ లీగ్, ప్రగతిశీల మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప మాట్లాడుతూ.. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల జోరుగా డ్రగ్స్ దందా కొనసాగుతోందన్నారు. కొన్ని మెడికల్ షాపులలో ఫార్మాసిస్ట్ ఉండడం లేదని, అనుభవం లేని వారితో మందులను విక్రయిస్తున్నారని ఆరోపించారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే మందులను విక్రయిస్తున్నారన్నారు. నిబంధనలు పాటించకుండా, ఎక్కువ ధరకు మందులను విక్రయిస్తున్న షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, లక్ష్మీబాయి, రవికుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, అధికారులు

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. చిక్కడపల్లి స్ట్రీట్ నంబర్ 2లో రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ డీఈఈ గీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. బీజేపీ నేతలు వినయ్‌కుమార్, స్థానికులు లక్ష్మణ్‌గౌడ్, శ్రీకాంత్, సుశీల్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. కవాడిగూడ, ముషీరాబాద్, రాంనగర్ డివిజన్లకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మంగళవారం 9 లక్షల రూపాయల విలువైన చెక్కులను గాంధీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

● ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

ముషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్‌హుస్సేన్, లక్ష్మణ్‌ను కలిసి భోలక్‌పూర్‌లో సమస్యలను వివరించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జాహెద్‌అలీ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో రోడ్లు నిర్మించాలి


జోనల్ కమిషనర్ రఘుకిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లో రోడ్లు ఏర్పాటు చేయాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రఘుకిరణ్‌కు కార్పొరేటర్ కె.రవిచారి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఉదయ్‌నగర్, పవిత్రనగర్, భరిణి ఆయిల్ డిపో, ఆజామాబాద్‌లో రోడ్లు దెబ్బతిన్నాయని, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈలు నాగేశ్వర్‌రావు, వినోద్‌కుమార్ తెలిపారు. రాజేంద్ర ఆయిల్ మిల్, తాళ్లబస్తీ, గాంధీనగర్, ఎర్రమంజిల్ ఫీడర్ల పరిధుల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ప్రివెంటివ్ మెడిసిన్, అంజయ్యభవన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఫీవర్ ఆస్పత్రి పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు పేర్కొన్నారు.

పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌పై ఆరోపణలు అవాస్తవం

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):ఓ యూట్యూబ్ చానెల్‌లో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌పై వచ్చిన కథనం అవాస్తవమని రాష్ట్ర పశువైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా. ఎం. రమేష్, డా. నాగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశుసంవర్ధకశాఖలో అక్రమాలకు పాల్పడుతూ, ఉన్నతాధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఓ ఉద్యోగిని డిసెంబరు 24న సస్పెండ్ చేశారని, అతడు కొంత మందితో కలిసి డైరెక్టర్ గోపీపై నిరాధారమైన ఆరోపణలు చేశాడన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి.రమణ, చిత్రంలో పాల్గొన్న నాయకులు

నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించండి

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు చెన్నారం మల్లేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంవీ రమణ, సమన్వయ కమిటీ నాయకుడు పైళ్ల ఆశయ్య మాట్లాడారు. క్షౌరశాలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఇందిరమ్మ ఇళ్లలో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్షౌర వృత్తిదారుల నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా జంపాల మనోహర్, జి.శ్రీనివాస్, అధ్యక్షుడిగా ప్రసాదం విష్ణు, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి అభిలాష్, ప్రధాన కార్యదర్శిగా చెన్నారం మల్లేష్, సహాయ కార్యదర్శిగా దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా ఉమారాణిని నియమించారు.

ట్రా‘ఫికర్’

పెరిగిన వాహనాల రాకపోకలు

● చిన్న ఆరోవోబీలతో సమస్య ● విస్తరించాలంటున్న ప్రజలు


కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో రైల్వే అండర్ బ్రిడ్జి

గోల్నాక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నిజాం కాలంలో అంబర్‌పేట నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. ప్రస్తుతం ట్రాఫిక్ పెరగడం, అవి చిన్నగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలను మాత్రమే రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి అనుమతిస్తే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాదని స్థానికులు అంటున్నారు. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాచిగూడ రైల్వేస్టేషన్‌ను 1916లో ప్రారంభించారు. రైల్వేస్టేషన్ నుంచి రైళ్లలో నిజాం నవాబుతోపాటు కుటుంబ సభ్యులు, అధికార యంత్రాంగం తరచూ ప్రయాణం చేస్తుండేది. రైళ్లు వెళ్లే సమయాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అండర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు. చాదర్‌ఘాట్ నుంచి అంబర్‌పేటకు వెళ్లే ప్రధాన రహదారిలో నింబోలి అడ్డవద్ద పెద్ద బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. దీని ద్వారా భారీ వాహనాలు కూడా వెళ్తుంటాయి. ఈ బ్రిడ్జి వద్ద అంతగా ట్రాఫిక్ సమస్య లేదు. చిన్నగా ఏర్పాటు చేసిన బ్రిడ్జిల వద్దనే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నింబోలిఅడ్డ నుంచి ఎస్సీ హాస్టల్ రహదారిలో, మాజీ కార్పొరేటర్ దుర్గాసింగ్ నివాసం గుండా వెళ్లే దారిలో, కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్, రైల్వే క్వార్టర్స్ ద్వారా కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలు చిన్నగా ఉన్నాయి. ఈ దారులగుండా వాహనాల రాకపోకలు పెరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.


నింబోలిఅడ్డ ఎస్సీ హాస్టల్ రోడ్డులో ఇరుకుగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి

ఫీవర్ ఆస్పత్రి నుంచి అంబర్‌పేటకు వెళ్లే దారిలో తిలక్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన రైల్వే బ్రిడ్జి పెద్దదిగా ఉండడంతో భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. శంకర్‌మఠం నుంచి శివం రోడ్డుకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కార్లు, చిన్న వాహనాలు వెళ్లడానికి మాత్రమే అవకాశం ఉంది. ప్రస్తుత పాలకులు చిన్నగా ఉన్న బ్రిడ్జిలను విస్తరించి ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలను విస్తరించాలని కోరుతున్నారు.

ఆర్వోబీలను విస్తరించాలి

నిజాం పాలనలో అప్పటి పరిస్థితులకనుగుణంగా రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వాటిని విస్తరిస్తే ట్రాఫిక్ సమస్యలు ఉండవు. వాహనదారుల సమస్యలను అధికారులు పరిగణలోకి తీసుకొని చర్యలు తీసుకోవాలి.

- భావి ధన్‌రాజ్, శాస్త్రినగర్,
మరికంటి కృష్ణరాజు, నెహ్రూనగర్



బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ దాడి సిగ్గుచేటు


మాట్లాడుతున్న ఎన్. గౌతమ్‌రావు

బర్కత్‌పుర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నేతలు దాడి చేయడం సిగ్గుచేటని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో దాడులకు స్థానం లేదని, తమ తప్పులను కప్పి పుచ్చుకోవడానికే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకే దాడులకు దిగుతుందని విమర్శించారు. బీజేపీ కార్యాలయంపై దాడిచేసిన కాంగ్రెస్ నేతలను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

యూత్ కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయాలి

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి అమానుషం అని, దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పి.సాయికృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. దాడికి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ బాధ్యత వహించాలన్నారు. మంగళవారం అడిక్‌మెట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు కర్రలు, రాళ్లతో దాడి చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు.

దాడి అప్రజాస్వామికం

బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి అప్రజాస్వామికం అని బీజేపీ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యుడు డాక్టర్ ఓ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.


శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, కళా జనార్దనమూర్తి తదితరులు

చైతన్యాన్ని నింపిన శ్రీశ్రీ కవితా ప్రభంజనం

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ కవితా ప్రభంజనం అనేక మందిలో చైతన్యాన్ని నింపిందని ఎమ్మెల్సీ ఎస్. మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శ్రీశ్రీ యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యాన్ని తన రచనలతో శ్రీశ్రీ మరో మలుపు తిప్పారన్నారు. సినీ పాటల్లో కూడా సామ్యవాద అభ్యుదయ భావాలు జోడించారన్నారు. వంశీ రామరాజు, గరిమెళ్ల సీత, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్పీడ్ బ్రేకర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

బర్కత్‌పుర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలోగల పాఠశాలల వద్ద ప్రమాదాలను నివారించడానికి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం మోతీ మార్కెట్ ప్రభుత్వ పాఠశాల, కేడియా పాఠశాలల వద్ద స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. మరికొన్ని పాఠశాలల వద్ద కూడా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు సుభాష్‌పటేల్, రవి, బాబన్న, బీంరాజ్, రవియాదవ్, సంతోష్, రామకృష్ణ, నాగరాజు జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కారోబార్‌లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలి

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కారోబార్‌లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని రాష్ట్ర కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు సాధుల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన కారోబార్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 51 రద్దు చేయాలని, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే త్వరలో 20 వేల మందితో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు తేలుకంటి మురళీ, విజయ్‌కుమార్, రాజేందర్, ప్రభాకర్, శ్రీనివాస్, బాబుగౌడ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంకా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు..

బీజేపీ నేత క్షమాపణ చెప్పకపోతే ఆందోళన


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నాగభూషణంగౌడ్, స్వప్న

ముషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంకా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేష్ బిధూరి క్షమాపణ చెప్పాలని ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రియాంకా గాంధీపై బీజేపీ నాయకుడు రమేష్ బిధూరి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంపై బీజేపీ నాయకులు కట్టెలు, రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడులు చేయడంతోపాటు గాంధీభవన్ ముట్టడికి యత్నించడం, ఫ్లెక్సీలు చింపివేయడం, ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.

మహిళా సంక్షేమమే ధ్యేయమని బీజేపీ ఒక పక్క ప్రకటిస్తూ మరోపక్క మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రియాంకాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిధూరి క్షమాపణ చెప్పకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా కమిటీ సేవాదళ్ అధ్యక్షురాలు స్వప్నాగౌడ్, పార్టీ నాయకులు అమరేందర్, ప్రేమ్‌కుమార్, రాంచందర్ పాల్గొన్నారు.

ప్రేక్షక రంజక గానం రేణుక సొంతం

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షక రంజకంగా గానం చేయడంలో రేణుక దిట్ట అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. వంశీ ఇంటర్నేషనల్(ఇండియా) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం రేణుకకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వంశీ రామరాజు మాట్లాడుతూ.. ప్రముఖ నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, సావిత్రి, జమున వంశీ సంస్థలకు ఎంతో ఆప్తులన్నారు. సుంకరపల్లి శైలజ, నటుడు శంకర్ పాల్గొన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, సావిత్రి, జమునలు నటించిన సినిమాలలోని పాటలను రేణుక వైఎస్ రామకృష్ణతో కలిసి మధురంగా గానం చేశారు.

నల్లకుంటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాలి


డీఎంసీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

నల్లకుంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాలని, జాబితాలో పేర్లు లేని వారిని చేర్చాలని కార్పొరేటర్ యాకర అమృత కోరారు. మంగళవారం అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీ దివాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శంకరమఠం కూరగాయల మార్కెట్, న్యూ నల్లకుంటలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

కార్పొరేటర్ హౌస్ అరెస్ట్



గాంధీభవన్‌పై దాడి చేస్తారన్న నేపథ్యంలో బీజేపీ నేతలను, కార్పొరేటర్లను పోలీసులు మంగళవారం హౌస్ అరెస్ట్ చేశారు. కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి రచనశ్రీని దోమలగూడ పోలీసులు ఇంటి నుంచి బయటకు రానీయలేదు.

- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి

లేబర్‌కోర్టు బార్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్ మంగళవారం ఆవిష్కరించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో లేబర్‌కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రఘురామ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఎం. మధుసూదన్, ఉపాధ్యక్షులు వి. తిరుపతిరెడ్డి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు సీహెచ్ ప్రతాప్‌లింగం, డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌జాజు తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా లీగల్ బృందం, రెవెన్యూ అధికారులను సన్మానించిన రంగనాథ్

బతుకమ్మకుంట పునరుద్ధరణపై..

హైడ్రాకు అనుకూలంగా హైకోర్టు తీర్పు

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మకుంట పునరుద్ధరణపై హైడ్రాకు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. స్థలం తనదంటూ ఎడ్ల సుధాకర్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను మంగళవారం న్యాయస్థానం కొట్టివేసింది. మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఫిర్యాదు మేరకు నవంబరు 13న బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. అదేరోజు కుంట పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. మరుసటిరోజు సుధాకర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం స్టే ఇచ్చింది. పునరుద్ధరణకు అనుకూలంగా హైకోర్టు తీర్పునివ్వడం పట్ల రంగనాథ్ హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా లీగల్ బృందం, రెవెన్యూ అధికారులను ఆయన సన్మానించారు.

అంగన్‌వాడీల్లో సదుపాయాలు కల్పించాలి

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి సూచించారు.

మంగళవారం తురబ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందజేయాలన్నారు.


విద్యార్థినులకు న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న సంధ్యారాణి

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ముషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సంధ్యారాణి అన్నారు. మంగళవారం జమిస్తాన్‌పూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్‌ను ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, వాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలంటూ నిరసన


అంబర్‌పేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ మోసపూరిత విధానాలను బీసీలు గమనిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. అనంతరం బీజేపీ నేతలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం

కవాడిగూడ: కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఓబీసీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఉమేష్ ఆరోపించారు.మంగళవారం ముషీరాబాద్ తహసీల్దార్ రాణాసింగ్ ప్రతాప్‌కు మోర్చా నేతలు వినతిపత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.